కథా నిలయం
831
శ్రీకాకుళం

# థ్రిల్ !

ఉదయం ఏడుగంటలు కావస్తోంది.

అప్పటివరకూ సన్నగా పడుతూన్న వానజల్లు పూర్తిగా ఆగిపోయింది. రిటైర్డ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు కొత్తగా కట్టుకున్న తన డాబా ఇంటి ముందున్న చిన్న గార్డెన్‌లో కుర్చీలో కూర్చున్నాడు. దిన పత్రిక తెచ్చి కుర్చీ దగ్గరలో వో స్టూలు వేసి దాని మీద పత్రిక పెట్టి లోపలి కెళ్ళిపోయింది పని పిల్ల. వాన జల్లుకి తడసిన గులాబీ పూవులనీ, మొగ్గలనీ చూస్తూ ఇంగ్లీషు పత్రిక అందుకున్నాడు. ఆయన ఒక్క ఇంగ్లీషు పత్రికే కాదు. ఇంకా కొన్ని ఇంగ్లీషువీ, తెలుగువీ కూడా చాలా ప్రతికలు తెప్పిస్తాడు.

'అన్ని దినపత్రికల్లో వార్తలూ ఒక్కలానే ఉంటాయిగా, డాడీ! మరి ఇన్ని ఎందుకు తెప్పిస్తారు చెప్పండి" అంటుంది ఆయన ఏకైక పుత్రిక కళ్యాణి.

"వార్తలు ఒకటే అయినా రాసే విధానంలో తేడా ఉంటుంది కదమ్మా. ఒకే విషయాన్ని ఇందరు ఎడిటర్సు ఇన్నిదృక్పథాలలో రాసినవి చదవటం నా కో హాబీ అంతే."

"ఈహాబీ రిటైర్ అయిన తర్వాతదే కదూ!" అంటూ నవ్వుతుంది కళ్యాణి.

"కరెక్ట్." అయనా నవ్వేస్తారు. కళ్యాణి తండ్రికి కాఫీ ఇచ్చి లోపలికి వెళ్ళు ఈరోజూ అలాగే చేసింది.

కళ్యాణి భర్త డాక్టర్ రాజారావు. కళ్యాణికి పెళ్ళి కాగానే తల్లి కాన్సర్‌తో పోయింది. అప్పటి నుంచీ కళ్యాణి తండ్రిని పసివాడిలా చూసుకోసాగింది. కూతురి దగ్గర ఆయన జీవితం హాయిగా గడిచి పోతూనే ఉంది. కానీ, కాలక్షేపం కాకపోవటం ఒక్కటే ఇబ్బందిగా ఉంది. కాస్సేపు పత్రికలూ, ఆ తర్వాత వాకింగూ, తర్వాత స్నానం, భోజనం విశ్రాంతీ, తర్వాత రేడియో. మళ్ళా సాయంత్రము షికారూ. రాత్రి కొంతసేపు టీవీ చూడటం తర్వాత భోజనం, నిద్రా. అప్పుడప్పుడు విసుగు వచ్చినా యెలాగో రోజులు గడుస్తూన్నాయి. కళ్యాణికి ఒకే ఒక్క కొడుకు బాబీ. కాన్వెంటు చదువు కావటం వల్ల ఇంట్లో కూడా ఇంగ్లీషే తప్ప తెలుగు మాట్లాడడు. తాతగారితో ఎక్కువసేపు మాట్లాడటం కూడా అతనికి నచ్చదు. చదువూ, ఆటలూ అంటూ తన ధోరణి తనదిగా ఉంటాడు. అతనకి అందరూ గొప్ప గొప్ప స్నేహితులు.

త్రినాథరావుగారు రోజూలానే ఒక పత్రిక ఎడిటోరియల్ చదవటంలో మునిగిపోయారు. గేటు తెరిచిన శబ్దంతోబాటు బూటు టక్ టక్ శబ్దం అలా అలా వచ్చి తన దగ్గర ఆగటం కాస్త ఆలస్యంగా గమనించి పేపరులోనించి తలెత్తి చూస్తూ అన్నారు.

"ఎవరు"?

"నమస్కారం, సార్?" పోలీసు ఇన్‌స్పెక్టర్ దుస్తుల్లో వో యువకుడు హాటుతీసి పట్టుకొని నిలబడి ఉండడం చూసి కళ్ళజోడులో నించి నిశితంగా పరిశీలిస్తూ మళ్ళీ ప్రశ్నించారు.

"ఎవరు నువ్వు?"

"నేనే. నేనే!" అందంగా, భారీగా ఉన్న అతన్ని గుర్తించలేనట్లు తల వూపారు.

"నేను త్రినాధరావుని",

ఈపేరు వినగానే ఆయనికి చప్పున జ్ఞాపకం వచ్చింది. అంతే గభాలున లేచారు, అతని చేతిని గట్టిగా పట్టుకొని అడిగారు.

"నువ్వా బాబూ! నీ కీ వూర్లో పోస్టింగు వచ్చిందా?"

"అవునండీ. నాలుగు రోజులైంది జాయిన్అయి. మొదటి రోజే మీ దగ్గరికి రావాలని అనుకున్నాను కానీ, పనుల తొందర వల్ల రాలేకపో యాను."

"దానికేంగానీ, నీ కీ ఉద్యోగం రావటం నాకు చాలా సంతోషంగా ఉంది. అందునా ఈవూర్లోనే! అలా కూర్చో" అంటూ కుర్చీ చూపి తను కూర్చున్నాడు.

ఇన్స్పెక్టర్ కూర్చున్నాడు.

'నువ్వు రాసే ఉత్తరాలు నాకు అందుతూనే ఉన్నాయి. కానీ జవాబులు రాయటానికి బద్ధకం అడ్డుపడేది."

"ఫర్లేదుగానీ, మీ ఆరోగ్యం బాగుందా?"

"దాని విషయం మా అల్లుడు చూసుకుంటాడు. నే చూసుకోవల్సిం ది మానసిక ఆరోగ్యం విషయమే!"

ఇన్స్పెక్టర్ చిన్నగా నవ్వాడు.

"అమ్మా కళ్యాణి! వో ఫ్రెండ్ వచ్చాడు మరో కప్పు కాఫీ పంపు." కేకపెట్టి మళ్ళా కబుర్లలో పడ్డారు. పోలీసు డిపార్టుమెంటులో ఉండే కష్ట నిష్ఠూరాలూ, తన సర్వీసులోని అనుభవాలూ చెప్తూ

"నా సర్వీసులో దోషులు అనుకున్న వాళ్ళు కొందరు నిర్దోషులైతే, నిర్దోషుల్లా కన్పించిన కొందరు దోషులై నాకు షాక్ తెప్పించేవారు. ఈ కాలంలో మనిషి ముఖం చూసి 'ఎలాంటి వాడు?' అని చెప్పటం కష్టమైపోతూ ఉంది. అమాయకత్వం నటిస్తూ పోలీసు వాళ్ళనే ధోకా తినిపించే ప్రబుద్ధులు ఎందరో ఎదురయారు. దొంగలూ, దొరలూ మనకి ఒక్కలానే కన్పిస్తున్నారు. బహుశా ఇదంతా నాగరికత ప్రభావం కావచ్చు, మనుషుల అతి తెలివి కావచ్చు."

ఇన్‌స్పెక్టర్ ముసలాయన చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు. "నేను డ్యూటీలోజాయిన్ అయిన మొదటి రోజు కేసు ఏమిటో నా కిప్పటికీ బాగా గుర్తు ఉంది. ఒక అమాయకపు బాలికను వో రౌడీ మోసగించి ఈ సిటీకి తీసుకు వచ్చిన వెంటనే పట్టు బడ్డాడు. ఆ పిల్లని రక్షించి ఆమె తల్లిదండ్రుల దగ్గరకి చేర్చినప్పుడు వాళ్ళు చూపిన కృతజ్ఞత మరువలేను. ఆ అమ్మాయి పెళ్ళిచేసుకుని పిల్లాపాపలతో కాపురం చేస్తూ ఉండి ఉంటుంది అవునా?"

"అవును ఉండి ఉంటుంది" అన్నట్లుగా తల వూపాడు ఇన్‌స్పెక్టర్. ఇంతలో కళ్యాణి కాఫీ తెచ్చింది.

త్రినాథరావు ఇన్‌స్పెక్టర్‌ని కూతురికి పరిచయం చేసాడు "నా శిష్యుడమ్మా! మన కింక దొంగల భయం లేదు."

కళ్యాణి అతనికి నమస్కరించింది.

ఇన్‌స్పెక్టరూ ఆమెకి నమస్కారం చేశాడు.

"డాడీ వాళ్ళ జాతి వాళ్ళని చూశారా ఇంక వదలరు. తన సర్వీసు లో సంఘటనలు కాశీ మజిలీ కథల్లా చిత్ర విచిత్రంగా చెప్తూంటారు. మీరు బోరు ఫీలవుతున్నారా?" అంది.

"లేదు. చాలా ఇష్టంగా వింటూన్నాను."

"వోర్పు మంతులే నన్న మాట."

"అన్నమాట కాదు. ఉన్నమాట. అతని జీవితం వో కథ. చాలా కష్టపడి పైకొచ్చాడు కళ్యాణి!"

"అలాగా!"

"నేను కష్టపడినా సరైన దారిలో నడవాలని చూపిందీ, ప్రోత్స హించిందీ మీ నాన్నగారేనండీ! ఇందువల్లనే అనుకుంటాను- నాకు దేవుడు మరెవరో కాదు- ఈయనే."

ఇన్‌స్పెక్టర్ కళ్ళలోని కృతజ్ఞత చూసి త్రినాధరావుగారు తృప్తిగా ఫీలవుతూ-

"కాఫీ తాగవయ్యా ముందు" అన్నారు. ఇన్‌స్పెక్టర్ కాఫీ తాగి కప్పు కిందపెట్టి వాచీచూసుకుని చప్పున లేచి, 'వెళ్ళివస్తానండి, అన్నాడు.

"వెళ్ళటం, సరే అప్పుడప్పుడు వస్తూ ఉండు.

"అలాగే" అంటూ ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

త్రినాధరావుగారు మిగతా పేపర్లు చూడటంలో మునిగిపోయారు. కళ్యాణి ఖాళీ కప్పులు తీసుకుని వెడుతూ-

"డాడీ! అతనికి మీరు దేవుడు ఎలాగైనారో ఆ కథ డైనింగ్ టేబిలు దగ్గర చెప్పాలి" అంది.

"అలాగే నమ్మా! అప్పుడు గుర్తు చెయ్యి."

"సరే" నంటూ కళ్యాణి లోపలి కెళ్ళిపోయింది.

తండ్రికి దగ్గర కూర్చుని వడ్డిస్తోంది కళ్యాణి. ఆయన తాపీగా భోజనం చేస్తున్నారు.

"డాడీ! ఉదయం వచ్చిన కొత్త ఇన్‌స్పెక్టర్ గురించి చెప్తా నన్నారు గుర్తుందా?" అడిగింది.

"గుర్తులేదు. కానీ, నువ్వు గుర్తు చేశావు కదమ్మా ఇంక చెప్తాను."

కళ్యాణి ఉత్సాహంగా వినటానికి రెడీ అన్నట్లుగా కూర్చుంది.

"దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం అనుకుంటాను. ఒక రోజు నేను డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చేద్దామని అనుకుంటూండగా వో కుర్రాడిని పోలీసులు పట్టుకొచ్చారు. దాదాపు పన్నెండేళ్ళ వయసులో తెల్లగా బొద్దుగా ఒత్తైన క్రాపుని నిర్లక్ష్యంగా వెనక్కి విసురుకుంటూన్నట్లు తల ఆడిస్తూన్న ఆకుర్రాడు అతి సుకుమారంగా కన్పించాడు. నేను అతన్నే చూస్తూన్నాను.

"సార్! ఈకుర్రాడు వాళ్ళ ఇంట్లోనే దొంగ తనం చేశాడుట. ఇతని సవతి తల్లి ఇతన్నీ, ఇతను దొంగిలించిన గాజులనీ చూపి మా కప్ప గించి, చేసిన తప్పుకి కఠినంగా శిక్షించమని మరీ మరీ చెప్పింది" అన్నాడు కానిస్టేబుల్.

"ఇతను దొంగా?" ఆశ్చర్యంగా చూశాను.

"అవును, సార్, సాక్ష్యం ఉంది."

మరీ పరిశీలనగా అకుర్రాడి కళ్ళలోకిచూశాను. అతను నిర్భయంగా

నావైపు చూస్తూన్నాడు. నాకు కోపం వచ్చేసింది. పోలీసు ఆఫీసర్లంటే ఇంత చిన్న కుర్రాడికూడా లోకువే అనుకుని గద్దించినట్లు అడిగాను.

"నీ పేరేమిటి?"

అతను మాట్లాడకుండా నావైపు చూడసాగాడు.

"నీ పేరేమిటని అడుగుతున్నాను." గద్దించాను.

"త్రినాథరావ్!"

ఆఁ... ఈగొంతు ఎక్కడో, ఎప్పుడో విన్నట్లు గుర్తు వస్తోంది.

"చదువుకోవటం లేదూ?"

అతను మవునంగా ఉండిపోయాడు. నాకు అలవాటు ప్రకారం నోటి నుంచి తిట్లు రాసాగాయి. అవి వింటూనే అతను చివ్వున లేచి నుంచున్నాడు. అతని ముఖం ఎర్రగా కందిపోయింది.

"ఇన్‌స్పెక్టర్! మర్యాదగా మాట్లాడు."

ఇంత చిన్న కుర్రాడి నోటి నుంచి ఇలాంటి మాట వినటం అలవాటు లేని నాకు షాక్ తగిలినట్లు అయింది. అయినా ఆవేశంగా కుర్చీలోంచి లేచి అతని దగ్గరగా అడుగులు వేశాను.

అతని కళ్ళలో భీతి లేదు. తెలివి కలవాడు మూర్ఖుడిని చూసే చూపుఅది ,ఈకళ్ళు, ముఖం ఎక్కడో చూసినవే కానీ, ఎక్కడ చూసి ఉంటాను! దొంగగానా? కాదు కాదు... ఆలోచిస్తూ అతని రెక్క పట్టుకోబోయాను. విసిరి కొట్టాడు. ఆకొట్టడంలో అతని చేతి మీదున్న పెద్ద పుట్టుమచ్చ కన్పించింది. అంతే— అతన్ని ఎక్కడ చూశానో చప్పునగుర్తుకి వచ్చింది.

"నీపేరు ...నీపేరు ఏమిటన్నావూ" అన్నాను.

"త్రినాథరావ్. రెండేళ్ళ క్రితం" అని ఇంకేదో మాట్లాడబోయి ఆగిపోయాడు. అతను ఆగినా నాకు గుర్తుకి వచ్చింది. రెండేళ్ళ క్రితం వో స్కూలు ఫంక్షన్‌కి నన్ను ముఖ్య అతిధిగా పిలిచి నప్పుడు స్కూలు పిల్లలకి ప్రైజులు పంచుతూంటే ఈకుర్రాడు ఆటల్లో ఫస్ట్, చదువులోనూ ఫస్ట్, పాటల్లో ఫస్ట్ అంటూ ప్రైజులు అందుకుంటూంటే నాకెంతో ముద్దు వచ్చి అతని చెయ్యి పట్టుకుని ఫోటోకి ఫోజు ఇచ్చాను. మర్నాడు పేపరులో ఫోటో వచ్చినప్పుడు మీఅమ్మ అది చూసి నాకు చూపింది.

'భలే ఉన్నాడు కదూ కుర్రాడు. ఇలాంటి ఒక్క కొడుకు మన కుంటే అంటూ ఆ ఫోటోను కత్తిరించి దాచింది. ఆ రోజు తర్వాత నేనీ విషయం మరిచిపోయాను. కానీ ఇవేళ హఠాత్తుగా అతనే దొంగతనం నేరం ఆపాదించబడి ఇక్కడికి రావటం నన్ను ఆశ్చర్యపరిచింది. ఆవేశం ఎగిరి పోయింది. సౌమ్యంగా దగ్గరకి తీసుకుని అడిగాను-

ఇలా ఎందుకు చేశావని?

అప్పుడు అతని కళ్ళలో నీళ్ళు చూశాను.

"ఏం ఫర్వాలేదు చెప్పు. క్లాసు ఫస్ట్ వస్తూ చదువుకునే నువ్వే ఇలా ఎందుకు చేశావు? అస లీపని చేశావా, లేక..."

"చేశాను. నేను కావాలని చేశాను. ప్రతీకారం తీర్చుకోవాలని చేశాను." ఆవేశంగా అన్నాడు.

"ఎవరిమీద ప్రతీకారం?"

"మా అమ్మ చచ్చిపోయి రెండేళ్ళయింది. మా నాన్న రెండోపెళ్ళి చేసుకున్నారు. ఆమె ఒక దెయ్యంలాంటి మనిషి. మంచి బుద్ధి లేదు. ఈ మాట నాన్నకి చెప్పాను. నాన్న వినిపించుకోలేదు. ఆమే, ఆమె తమ్ముడూ మా ఇంట్లో చేరి గాదెకింద పందికొక్కుల్లా మేయటం కాక దోచుకో

సాగారు. ఇది చూసి సహించలేని నేను వాళ్ళకి అడ్డుపడేవాడిని. నా అడ్డు తొలగించుకోవాలని నేను దొంగతనం చేయకున్నా తన డబ్బు నేను తీశానని చెప్పి నాన్న చేత కొట్టించింది. ఆ కోపంలో ఆవిడ గాజులు తీశాను."

నిజం నిర్భయంగా ఒప్పుకున్న అతని నిజాయితీ నాకు సంతోష మైంది. దొంగలుగానే ఎవరూ పుట్టరని నాకు తెలుసు. పరిస్థితులు, అవస రాలు. దారిద్ర్యం, పరిసర వాతావరణం, ఇవన్నీ మనిషిని దొంగలా మారుస్తుందని తెలుసు. ఈ చిన్న మొక్కని కాస్త ఆదుకుని ఆసరాయిస్తే ఒకమంచి పౌరుడిలా తయారయ్యే లక్షణాలు కనిపించాయి. అందుకనే ఆ తండ్రి నుంచీ, తల్లినుంచీ దూరంగా ఉంచే ఏర్పాటు చేసి హాస్టల్‌లో చేర్పించి చదువు కొనసాగించే ఏర్పాటు చేశాను వాళ్ళ నాన్నకు నచ్చచెప్పి. నా అభిప్రాయం తప్పుకాలేదు. ఆ కుర్రాడు ఇంకా ఉత్సాహంగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుంటూ వాటిని నాకు చూపిస్తూ నా ప్రోత్సాహానికి పొంగిపోతూ అలా అలా కాలేజీ చదువుకి వచ్చాడు. అప్పుడప్పుడూ నా కోసం పోలీసుస్టేషన్‌కి రావటం వల్లనో, మరెందువల్లనో తనూ నాలా పోలీసు ఆఫీసర్ కావాలని కలలు కన్నాడు. అందుకు ఏం చేయాలో చెప్పాను. అతను అనుకున్నది సాధించాడు. దొంగగా మారవలసిన అతను సరైనా సమయంలో శ్రద్ధ వహించటంవల్ల దొంగల్ని పట్టుకునే పోలీస్ ఆఫీసర్ అయ్యాడు. చిత్రంగా ఉంది కదూ?" త్రినాథరావుగారు చెప్పటం ఆపి పెరుగు గిన్నె పళ్ళెంలో ఒంపుకుని కూతురిముఖంలోకి చూశారు.

"మీరలా ఒక యువకుడిని ప్రోత్సహించానని ఇంట్లో అన్నట్లు నా కెప్పుడూ గుర్తు లేదే?" ఆయన నవ్వారు.

"డ్యూటీ అయి ఇంటికివస్తే ఇంక బయట విషయాలు మరిచిపోయే వాడినమ్మా!"

"అయి ఉండవచ్చు. మీరు చేసిన ఈ మంచి పనికి మీ కూతురుగా నేనూ గర్వపడుతున్నాను, డాడీ!"

కూతురు మాటలకి ఆయన మనసు గతంలోకి పరుగు తీసింది. ఆ జీవితం అంతా చిత్రంగా గడిచినట్లుగా అనిపిస్తూంది. కానీ అప్పుడు కష్టం, సుఖం, విసుగు, కోపం ఒక్కోసారి యమటెన్షన్‌గా ఉండేది. ఉద్యోగానికి రిజైన్‌చేసి పారేసి యే కిల్లీ కొట్టు పెట్టుకున్నా శాంతంగా బతకచ్చన్న ఆవేశం వచ్చేది. దొంగలు, రౌడీలు, మంచివాళ్ళు, చేతకాని వాళ్ళు, మోసగాళ్ళు. ఆ అందరిమధ్యా తను ఇరుక్కున్నట్లు ఫీలింగ్. ఇప్పుడు తలుచుకుంటే నవ్వు వస్తూంది.

"డాడీ!" కళ్యాణి పిలుపుకి త్రినాథరావుగారు తన గతంలోనించి ప్రస్తుతానికి వచ్చారు.

"ఏమ్మా! ఏమిటి?" అడిగాడు ప్రేమగా.

"మన ఇంట్లో ఇప్పటికి రెండుమూడుసార్లు నా బెడ్ రూములో ఉంచిన డబ్బు పోయింది.

"మన ఇంట్లోనా! నీ బెడ్‌రూములో ఉంచిన డబ్బు ఎలా పోయిందమ్మా? ఎప్పుడూ చెప్పావు కాదేం?"

"నేనే నిర్ధారణ చేసుకోలేకపోయాను. నా రూములోకి పనిపిల్ల పార్వతి తప్ప మరెవరూ రారు. అది దొంగతనం చేయదు అని గట్టి నమ్మకం. ఇకపోతే తోటమాలి బసవయ్య అప్పుడప్పుడూ పువ్వులు కోసి హాలులోకి తెస్తాడు. అతనూ మంచివాడే. ఎవరినీ అనుమానించలేక మవునంగా ఉండిపోయాను. కానీ ఈరోజూ నా టేబిల్‌లోని వందరూపాయలు పోయాయి. మీరు చెప్పండి ఎవరు తీసుకుంటారు?"

అయన తల తిరిగిపోయింది. చెయ్యి కడిగి లేచి ఇటూఅటూ పచార్లు చేస్తూ తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. పనిపిల్లది ఈవూరు

కాదు. అది ఇల్లు వదిలి ఎక్కడికీపోదు. పైగా చాలా పిరికిది. ఇంక మిగిలింది తోటవాడు ఒక్కడే. వాడే తీసి ఉండాలి. వాడు స్థితినిమించి షోగ్గా ఉంటాడు. ఇంట్లో కబుర్లన్నీ, వాడికే కావాలి. ప్రతి వస్తువునీ పరీక్షగా, ఆశగా చూస్తాడు, ఆ చూపుల్లో ఏదో ఉంది అనుకునే వాడు తను. తన లాంటివాడు ఇంట్లో ఉండగానే వాడికి ఇంత ధైర్యమా!' అంతే బెల్టు తీసుకుని మొక్కలకి ఎరువులు వేస్తూ పాదులు చేస్తూ సినిమా పాటని కూనిరాగంగా తీస్తూన్న అతన్ని పిలిచి అడిగాడు.

"నాకేం తెలియదు బాబూ!" అంటూన్నా చావబాదేశాడు. వాడు గోలుగోలున ఏడుస్తూ "నాకు మీపని ఒద్దుబాబోయ్ అంటూపారిపోయాడు.

వాడి ఏడుపు చూసి బాధపడిపోయింది కళ్యాణి.

"నాన్నా! వాడు దొంగ కాడేమో!" అని.

"మరెవరున్నారు మనింట్లో పరాయివాళ్ళు?"

"ఎవరూలేరు నిజమే, కాని ఇదెలాజరుగుతోందో అర్థంకావటంలేదు.

"అంతగా ఆలోచించకు. వాడి పనే" తండ్రి ఇలా అనేసరికి ఇంక ఏం జవాబు చెప్పలేక వూరుకుండిపోయింది కళ్యాణి.

బాబీ స్కూలునించి వచ్చాడు. వస్తూనే డ్రెస్సు మార్చుకుని టిఫిను పెట్టుమమ్మీ!" అన్నాడు.

కళ్యాణి కొడుక్కి టిఫిన్ పెట్టి జరిగినది అంతా చెప్పింది.

కాస్సేపు అతను ఏం మాట్లాడలేదు.

"నే చెప్పింది వింటున్నావా లేదా?" విసుగుపడింది.

"వింటూన్నాను. ఆ తోటవాడి పనే అయివుంటుందిగానీ, మరో కొత్త మాలిని పెట్టేయమ్మా, అంటూ లేచి వెళ్ళిపోయాడు.

"ఏం పిల్లవాడు:" నెత్తి కొట్టుకుంది కళ్యాణి.

* * *

కొన్ని రోజులు గడిచిపోయినాయి. కొత్త తోటమాలి కుదిరాడు. కొత్త ఇన్‌స్పెక్టర్ ఒకటి రెండుసార్లు వచ్చాడు కానీ, తమ ఇంట్లో జరిగిన విషయం చెప్పలేదు శ్రీనాధరావు. కళ్యాణి చెబుతానని అన్నా వద్దు అని వారించాడు. ఆయన అసలు ఉద్దేశం తనుంటున్న ఇంట్లో ఇలాంటి చిల్లర దొంగతనాలు జరగటమా అని కొత్త కుర్రాడు నవ్వేయగలడేమో అన్న భావం.

కొత్త ఇన్‌స్పెక్టర్ కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్పి వెళ్ళిపోతూ వారి ఫోను నెంబరు డైరీలో నోట్ చేసుకున్నాడు.

"రాలేనప్పుడు ఫోనులోనైనా కబుర్లు చెప్పవచ్చుననా'' కళ్యాణి నవ్వింది.

"కరెక్టు. అదే నా అయిడియా?" అంటూ వెళ్ళిపోయాడు అతను.

కొన్నాళ్ళు గడిచిపోయినాయి. ఇంట్లోఉంచిన డబ్బుకి ఒకటి రెండు సార్లు లెక్కిస్తూండేది కళ్యాణి. ఇది చూసిన బాబీ నవ్వుతూ "ఏమిటి మమ్మీ! సింగరాజు లింగరాజులా ఏమి టాడబ్బులెక్కలూ?" అన్నాడు.

"ఎందుకైనా మంచిదని జాగ్రత్తగా ఉంటున్నాను అంతే."

"మమ్మీ! మనింటికి దొంగతనానికి రావటానికి ఎవరికైనా ఎన్ని గుండెలుండాలి. తాతగారు సింహంలా వాకిట్లో ఉండగా నీకేంభయంలేదు నిశ్చింతగా ఉండు?" కొడుకు మాటకి కొండంత ధైర్యం వచ్చింది కళ్యాణికి.

నిజమే సుమా అనుకుంది. కొన్నిరోజులు గడిచిపోయాయి. కానీ శ్రీనాధరావుగారు అప్రమత్తంగాలేరు. డబ్బుని హాలులోనూ, అల్మారాల్లోనూ ఉంచి పెంచిఉన్నారు. ఎక్కడ డబ్బు అక్కడే ఉంటూంది.

మీసం మెలేసుకున్నారు ఆయన, లోలోన గర్వంగా ఫీలవుతూ.

శుక్రవారం. కళ్యాణి తలంటుకోవటానికి, మెడలోని రెండు పరసల చెయిను డైనింగ్‌హాలులో ఉన్న స్టీలు భరణిలో పెట్టి స్నానంచేసి, వంటా పూజాచేసి భర్తనీ, కొడుకునీ పంపి గొలుసుకోసం చూసుకుంది. అది అక్కడలేదు. కళ్యాణికి గుండె బేజారైపోయింది. పనిపిల్ల జ్వరంతో లేవ లేని స్థితిలో ఉంది. తోటమాలి రాలేదు. వరండాలో తండ్రి కూర్చునే ఉన్నాడు. గొలుసు ఎలా పోయినట్లు: ఈ విషయం తండ్రికి చెప్పింది. ఆయన షాక్ తిన్నాడు. ఇల్లంతా మళ్ళీమళ్ళీ వెతికించారు. ఎవరు చేస్తూ న్నట్లు ఈ దొంగతనాలు. బయటివాళ్ళు ఎవరూ రాలేదు. కూతురు మతి చెడి ఇలా భ్రమపడటం లేదుకదా! ఛీఛీ కాదు. అల్లుడి పని కాదుకదా! రెండు చేతులా సంపాదించే సర్వస్వతంత్రుడు అతనికేం పని! మరి మిగి లింది మనవడు! వాడు క్రమశిక్షణలో ఆత్మీయులమధ్య అల్లారుముద్దుగా పెరుగుతున్నవాడు. కావాలన్నదల్లా ఇచ్చే ముగ్గురం ఉన్నాం. మరిఎవరి పని ఇది? ఆయన విసిగిపోయి కొత్త ఇన్‌స్పెక్టర్‌కి గుర్తులూ బరువూ చెప్పి ఫోన్ చేశాడు. కళ్యాణి అన్న పేరు స్పష్టంగా ఉందికూడా అన్నారు.

ఇన్‌స్పెక్టర్ మోటార్ సైకిల్‌పైన వచ్చాడు. విషయం మరోసారి విని వెళ్ళిపోయాడు. కానీ త్రినాధరావుకి చాలా అవమానంగా అనిపించ సాగింది. తనింట్లో ఇలాజరగటం, ఇంత చిన్నకేసుని పట్టుకోలేకపోవడం.

"తాతగారూ! ఏమైంది మీకేసు?" అంటూ బాబీ ముసిముసిగా నవ్వటం ఆయనకి మరీ బాధ కలిగిస్తూంది. కుర్రకుంకకి ఏం తెలుసు బాధ అని సరిపెట్టుకున్నాడు.

పదిరోజులు గడిచిపోయాయి. మధ్యాన్నం రెండుగంటలప్పుడు పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ వచ్చింది.

"గొలుసు దొరికింది — మీరు చెప్పిన గుర్తులన్నీ ఉన్నాయి. వెంటనే రండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

త్రినాథరావు కూతుర్ని తీసుకుని పోలీసు స్టేషనుకి వెళ్ళాడు. వీరి కోసమే ఎదురు చూస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎదురుగావచ్చి లోపలికి తీసుకెళ్ళి కుర్చీలు చూపాడు. ఇద్దరూ కూర్చున్నారు.

"ఇదిగో గొలుసు. మీదేకదూ. చూడండి" ఇన్‌స్పెక్టర్ అందించాడు కళ్యాణికి.

"ఇదినాదే. నాదే, డాడీ! మన గొలుసు దొరికింది." సంతోషంగా అంది, కళ్యాణి కృతజ్ఞత తెలుపుతూ.

"త్రినాథ్! ఇది ఎక్కడ ఎలా దొరికింది?" ఆతురత పట్టలేనట్టుగా కుర్చీలో కాస్త ముందుకు వంగి అడిగాడు.

"మామూలే, సార్! దొంగ సొత్తు అది. చౌకగా ఖరీదు చేసి కరిగించేసే మార్వాడి అతని దగ్గర దొరికింది. మరి కొందరి నగలు పోయాయని రిపోర్టులు రావటంతో ఆ విషయాలు ఆరాతీస్తే ఇతని మీద అనుమానం వచ్చింది. సోదాచేస్తే ఆ నగలతో పాటు ఈ గొలుసూ దొరికింది."

"అవునా" ఇంతకీ ఎవరు అమ్మారుట వాళ్ళకి?" త్రినాధరావుగారు ఊపిరి బిగబట్టి జవాబు కోసం ఎదురు చూడసాగారు.

"అదీ కూపీ లాగాను. హైస్కూల్లో చదివే కుర్రాడు అమ్మాడనీ, అతన్ని గుర్తించి మీ కప్పగిస్తామనీ చెప్పారు. పోలీసులను పంపాను. ఈ సరికి, వాళ్ళు వస్తూ ఉండాలి. అదుగో వచ్చేశారు!"

కళ్యాణి, త్రినాధరావూ ప్రహారీగోడ వైపు చూశారు. ఇద్దరిపోలీసుల మధ్య తలవంచుకుని వస్తూన్న కుర్రాడిని చూసింది. బాబీ! కళ్యాణి గొంతు తడారిపోయింది. త్రినాధరవుగారు కళ్ళు నులుముకుని మనస్సు తప్పు విషయాన్ని చూపిస్తూందా, లేక ఇది నిజమా అన్న సందిగ్ధంలోనే ఉన్నారు.

ఇన్‌స్పెక్టర్ వీరిని గమనించటం లేదు. తెల్లగా, బొద్దుగా ముద్దుగా ఉన్న ఆ కుర్రాడిని చూస్తూ మండిపడ సాగాడు.

"నీ వాలకం చూస్తే చదువుకుంటూన్న వాడిలా ఉన్నావు. ఎందుకు చేశా వీ దొంగతనం. ఇది తప్పని తెలియదా? నీ పేరేంటి?" గర్జిస్తున్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇన్‌స్పెక్టర్! మీరు నాకు తెల్సు. కానీ నేను మీకు తెలియదు. అంతా మీకు చెప్తాను. కానీ ఇందాకటి నుంచీ ఈ పోలీసులిద్దరూ నన్ను బూతులు తిడుతున్నారు. అలా వారిద్దరికి ఎదురు తిరిగానని లాటీతో పొడిచారు. దయ చేసి ఆ రాక్షసులని దూరంగా పొమ్మని చెప్పండి. ప్లీజు చెప్పండి!– మీ కంతా నిజం చెప్పేస్తాను."

ఇన్‌స్పెక్టర్‌కి కోపం కాస్త చల్లారింది. పోలీసుల వైపు కళ్ళెర్రజేసి చూశాడు. వాళ్ళు దూరంగా వెళ్ళిపోయారు.
పోలీసు డిపార్టుమెంటు పరువు తీస్తున్నారు ఈ పోలీసులు! లోలోపల విసుక్కున్నా పైకి గంభీరంగా చూస్తూ అన్నాడు—

"చూడూ విషయం సూటిగా, క్లుప్తంగా చెప్పు."

బాబీ లోపలికి వస్తూనే చూశాడు తాతగారినీ, తల్లినీ, చూడనట్లు తల వంచేసుకుని చెప్పసాగాడు.

"ఇన్‌స్పెక్టర్! మీరు నమ్మినా, నమ్మకున్నా జరిగింది చెప్తున్నాను. నే నీ దొంగతనం డబ్బుకోసం చేయలేదు." అని ఆగాడు.

ఇన్‌స్పెక్టర్‌కి కోపంతో కళ్ళెర్రబడ్డాయి.

"డబ్బుకోసం కాకుంటే మా డిపార్టుమెంట్ సామర్థ్యం ఎంతుందో పరీక్షించాలని చేశావా? చూడూ కట్టు కథలు చెప్పకు."

"నేను దొంగతనం సరదాకి చేశాను." పోలీసు ఆఫీసర్‌ని అనీ, తన సర్వీసులో ఎందరో దొంగలను పట్టుకుని దండించానని చెప్పే తాతయ్యని ఏడిపించాలని చేశాను. సరదాగా చేసిన దొంగతనంవల్ల వచ్చిన

డబ్బుని ఎలా ఖర్చు చేయాలో తెలియక స్నేహితులని సలహా అడిగాను. ఎంతడబ్బునైనా చిటికెలో ఎలాఖర్చు చేయవచ్చునో చెప్పిన ఆ స్నేహితుల వలలో చిక్కుకున్నాను. వాళ్ళ జల్సాకోసం నన్ను పెద్ద హీరోలా అందలం ఎక్కించినట్టు చెప్పే కబుర్లకి పరవశించిపోయి మళ్ళీ మళ్ళీ చేశాను. అలా దొంగిలించి పట్టుబడకుండా తాతయ్యకి ఢోకా యిచ్చి నా తెలివికి నేనే గర్వ పడ్డాను. థ్రిల్ ఫీలయ్యాను. స్నేహితుల పొగడ్తలకి పొంగిపోయి సరదాని సరదాగా వదల్లేక పోయాను. మొదట మొదట డబ్బుతీసినా తాతయ్య పోలీసు మనస్తత్వాన్ని గ్రహించి దొంగని పట్టుకోవాలన్న ఆయన ప్లానుని పక్కదారి పట్టించి అమ్మ గొలుసుని తీశాను. కానీ తర్వాత అమ్మ పడుతూన్న ఆవేదనని చూసి చలించిపోయాను.

ఆ గొలుసు దాచిన స్నేహితుడిని అడిగాను నా గొలుసు ఇచ్చేయ మని వాడు ఇవ్వలేదు. పైగా భయపెట్టాడు.

'ఇది తిరిగి ఇస్తే పాత దొంగతనాలన్నీ నీ మీద పడేస్తారని.'

'రావు. వచ్చినా, నా తప్పు ఒప్పుకుంటే అమ్మ క్షమిస్తుంది. డాడీ కోపగించి కొట్టినా, అమ్మ, తాతగారూ చూస్తూ వూరుకోరని ఎంతో చెప్పాను. అతను వినలేదు. మర్యాదగా మాతో వచ్చి గొలుసు అమ్ముతావా ? లేకుంటే ఈ విషయం స్కూల్లోనూ బైట పెడతాం అని నన్ను బ్లాక్ మెయిల్ చేశారు. స్కూల్లో నా పరువుపోవటం సహించలేని నేను, వాళ్ళకి లొంగిపోయాను, ఆ గొలుసు అమ్మటం ఎలాగో నాకు తెలియకున్నా వాళ్ళవెంట వచ్చి ఆ మార్వాడీకి యిప్పించారు. డబ్బుని వాళ్ళుతీసుకుని రెండు రోజులు ఎంజాయ్ చేయించారు. ఇది చేస్తున్నప్పుడు నా అంతరాత్మ 'ఇది తప్పు ఇది తప్పు' అని హెచ్చరిస్తూనే ఉంది. అయినానేనేం చేయలేకపోయాను ఇన్‌స్పెక్టర్! నే చెప్పవల్సింది అయిపోయింది. నా తప్పుకి శిక్ష వేయండి."

ఏడవసాగాడు బాబీ.

ఇతను నిజంగా చేసిన తప్పుకి బాధపడుతున్నాడా? లేక పట్టుబడటం వల్ల కట్టుకథ కల్పించి చెప్తూన్నాడా అన్నది నిర్ధారించుకోలేక ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"నీ పేరు బాబీనా? మీ నాన్న పేరు?"

"చెప్పను"

"మీ తాతగారు?"

బాబీ చెప్పనన్నట్లుగా తల తిప్పాడు.

నేను నీకెలా తెల్సు?" విసుగు ఎక్కువైంది ఇన్‌స్పెక్టర్‌కి.

"ఇన్‌స్పెక్టర్! వాడి తాతని నేనే!" త్రినాధరావుగారి మాటకి ఆశ్చర్యపోతూ తలతిప్పి చూశాడు.

"సార్ ఇతను... మీ..."

"అవును! నా మనుమడే! ఆశ్చర్యపోకు, త్రినాధ్! నా మనవడు దొంగతనం చేశాడు. దొరలా పెంచుతున్న మనవడు దొంగతనం చేశాడు ఎందుకూ? తల్లిదండ్రుల ఆత్మీయత కరువైందా? లేదు. దరిద్రమా? కాదు. తన అవసరాలు తీరకనా? అదీకాదు. అజ్ఞానమా? అదీ కాదేమో. ఇంటి వాతవరణమా? కాదు. బైటి స్నేహితుల ఆకతాయితనమా? కాదు. కాదు. ఎందుకు చేశాడు. 'దొంగతనం తప్పని తెలిసీ ఎందుకు చేశాడు? వాడి మాటల్లోనే చెప్పాలంటే కారణం థ్రిల్. తన తెలివితేటలతో తాతనైన నన్ను, అందునా రిటైర్‌డ్ పోలీసు ఆఫీసర్ అయిన నన్ను షాక్ తినిపించి, చూసి ఆనందించాలన్న థ్రిల్‌లో చేసిన ఈ పని ఎలాంటి పరిస్థితుల్లో చిక్కుకునేలా చేసిందో చూశారా? వీడి తప్పుకి ఏ శిక్షవేయాలి అన్నది కాదు ప్రశ్న! ఎందుకిలా జరుగుతున్నదీ అన్నది ప్రశ్న! ఇలాంటి మన స్తత్వాలని పెంచుకుంటూ ఈకుర్రాళ్ళే పెరిగి యువతగా మారి సమాజానికి

తలనొప్పిగా తయారైతే యావత్ సమాజమూ వీరి చర్యలకి బాధపడవల్సిందేనా? ఇదే ఇదే నాలో చెలరేగుతూన్న బాధ! ఈ పసి మనస్సుల మీద విష ప్రభావం సోకకుండా రక్షించుకునేదెలా? ఎలా అన్నదే నా ప్రశ్న?"

ఆయనలో ఆవేశం, దుఃఖం ఒక్కుమ్మడిగా వచ్చేశాయి. చివాలున లేచి ఉన్మాదిలా స్టేషనుబైటికి వచ్చేస్తూ గొణగసాగారు.

"సార్, సార్!" ఇన్‌స్పెక్టర్ బిగ్గరగా అరుస్తూవస్తూనా, ఆయన విన్పించుకునే స్థితిలోలేరు.

"డాడీ...డాడీ!" కళ్యాణి గొంతు దూరం నుంచి విన్పిస్తోంది.

అయినా ఆయన వెనుదిరిగి చూడలేదు.

'వీళ్ళని ఎవరు రక్షిస్తారు? ఎలా రక్షిస్తారు. చెడుపనికి మంచి ఫలితం కల్గుతుందా? చెప్పండి! నా ప్రశ్నకి బదులు ఏది? ఏది? *